

గురువారం | 11 | జూన్ | 2026 ◆ పేజీలు : 5

# రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి ప్రాణాలకు రక్షణగా నిలిచే అత్యవసరమైన అంశం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కూసుమంచి మండలం నాయకులగూడెం గ్రామంలోని పీవి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన గ్రామసభ లో రోడ్డు

మిగతా 2 లో...



# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం...

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సంక్షేమ పథకాలు అమలు
- మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం
- పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి
- స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించాలి
- 3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రైయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.బుధవారం ఖమ్మం నగరం లోని ఎఫ్ సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ఇంట్లో కూడా అన్నిపనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని

మిగతా 2 లో...

# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి



- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు
- మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి
- ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ ఏలను నియమించి ఎస్ ఐఆర్ కార్యక్రమానికి సహకరించాలి
- అనామలీ ఓటర్ల సమస్యలను పూర్తి ప్రక్రియ ద్వారా పరిష్కరించాలి
- ఎస్ ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** అర్హులైన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐఆర్)

మిగతా 2 లో...

# పాఠశాలను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్ ఏవో అశోక్



**కారేపల్లి, జూన్ 10, ప్రజాజ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని గాదెపాడు గ్రామ పంచాయతీలోని ఎంపీ యుపిఎస్ స్కూల్లో స్పెషల్ అధికారి సింగరేణి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అశోక్ బుధవారం స్కూల్స్ లో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ ని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. మంచినీటి వసతి, మరుగుదొడ్ల మరమ్మతులు, తరగతి గదులలో కల్పించాల్సినటువంటి మౌలిక వసతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, హెచ్ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు మంగీలాల్, కిషన్, మురళి, కృష్ణవేణి పాల్గొన్నారు.

# వామ్మో... జూన్...!





- తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న ప్రవేట్ పాఠశాలలు
- ఓవైపు బడి... మరోవైపు ఖరీఫ్.
- పేద మధ్యతరగతుల కుటుంబాలపై భారం.
- ఫీజుల మోత... నిత్యవసర ధరలకు రెక్కలు..
- అన్నదాతలకు సైతం సాగు పెట్టుబడులు.

**నేలకొండపల్లి, జూన్ 10 ప్రజా జ్యోతి :** జూన్ మాసం వచ్చిందంటే పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులకు, వ్యవసాయం చేసే రైతులకు భారీ ఖర్చులు ఉంటాయి. మరో వారం రోజుల్లో వేసవి సెలవులు ముగిసి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రులకు ఫీజులు పెనుబారంగా మారుతున్నాయి. పిల్లల ఫీజులు, సాగు ఖర్చులు తలుచుకుంటే విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. పేద మధ్యతరగతి రైతులకు ఈ మాసం గట్టెక్కేందుకు లక్ష రూపాయలు అప్పు చేయాల్సి వస్తుంది. తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివించాలని అత్యాశతో

మిగతా 2 లో...

## వామ్మో.... జూన్....!



(మొదటి పేజీ తరువాయి...)

ఆయా తల్లిదండ్రులు అప్పుల పాలు కావలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. నేలకొండపల్లి మండల పరిసర ప్రాంతాల లోని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా పుట్టుకొస్తున్నాయి. ఆయా స్కూలు, కాలేజీలు వ్యాపార సంస్థలుగా మార్చేస్తున్నారు. తాము పడ్డ కష్టాలు తమ పిల్లలకు రావద్దని భావించి చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో చేరుస్తున్నారు. పిల్లల తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుని ప్రైవేట్ యజమాన్యాలు అందిన కాడికి దండుకుంటున్నాయి. ఎల్కేజీ, యూకేజీ చదువులకు ఏడాదికి 25 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. 1 నుంచి 5వ తరగతి వరకు 40 వేల రూపాయల వరకు ఆపై తరగతులను బట్టి ఫీజులు పెంచుతూ పోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీంతోపాటు పాఠశాలలోనే యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్, టై, షూ ఇలా అన్ని విక్రయాలు జరుపుతున్నారు. ఇరుకు గదులు, క్రీడా మైదానం లేకపోవడం, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, త్రాగునీరు తదితర సౌకర్యాలు లేనప్పటికీ ఫీజుల వసూళ్లలో మాత్రం వెనకాడడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

అన్నదాతకు సాగు ఖర్చు: ఈ నెల ప్రారంభంలోనే తొలకరి వానజల్లులు పడ్డాయి. సాగు కోసం ఇతరుల వద్ద అప్పు చేయాల్సిన పరిస్థితి రైతులది. ఎకరా సాగు చేయడానికి పదివేల రూపాయల నుంచి 15వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇంకా వీటికి కవులు అదనంగా భరించాల్సి వస్తుంది. యుద్ధం కారణంగా పెరిగిన డీజిల్ ఖర్చులతోపాటు అధికంగా పెరుగుతున్న ఎరువుల ధరలు ఎరువులు విత్తనాలకు ఖర్చు అవుతుంది. దీనికి తోడు రోజురోజుకు పెరుగుతున్న గ్యాస్ ఖర్చులు పెనుబారం అవుతున్నాయి. ఈ నెల ప్రారంభం నుంచి డబ్బులు ఖర్చు చేసే పనులే ఉంటాయి. కనుక అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

## రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి ప్రాణాలకు రక్షణగా నిలిచే అత్యవసరమైన అంశం

(మొదటి పేజీ తరువాయి...)

భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డుపై ప్రతి ఒక్కరి బాధ్యతాయుతమైన ప్రవర్తన ఎంతో మంది కుటుంబాల జీవితాలను కాపాడుతుందన్నారు. ప్రయాణికులందరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడానికి ఇది దోహదపడుతుందన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం, వాహనం నడిపేటప్పుడు ఏకాగ్రత వహించడం, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎన్నో ప్రాణాంతక ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ను ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవర్ తో పాటు పక్కన కూర్చున్న వారు, వెనుక కూర్చునే తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. వాహనాన్ని పరిమిత వేగంతో మాత్రమే నడపాలని, వేగం పెరిగే కొద్దీ ప్రమాదాలు జరిగే అవకాశం, వాటి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. మద్యం, మత్తు పదార్థాలను సేవించి ఎప్పుడూ వాహనం నడపకూడదన్నారు. ఇది మీ ప్రాణాలకే కాక ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లలో మాట్లాడటం, మెసేజ్ చేయడం వంటివి చేస్తే మీ ఏకాగ్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. రోడ్డుపై ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్, బోర్డులు, సూచికలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు దాటేటప్పుడు ఎల్లప్పుడూ జీబ్రా క్రాసింగ్ ఉపయోగించాలన్నారు. వాహనదారులు సైతం పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికేట్ వెంట ఉంచుకోవాలన్నారు. ఇటీవల కూసుమంచి మండలంలో యాక్సిడెంట్ కు గురైన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సలహాలు సూచనలు ప్రజలకు తెలియజేశారు. అదేవిదంగా ప్రమాదానికి గురై చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ధర్మ తండా చెందిన జర్పుల లలిత కుమారుడు సందీప్ యాక్సిడెంట్ గురై చనిపోయిన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతి రెడ్డి, కూసుమంచి సీఐ టి . సంజీవ్ కూసుమంచి ఎస్సై నాగరాజు తిరుమలయపాలెం ఎస్సై, ఎస్సై జగదీష్, నేలకొండపల్లి ఎస్సై సంతోష్, ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ ఎస్సై స్రవంతి, పి ఎస్ ఐ దివ్య, కూసుమంచి ఎమ్మార్వో, ఎంపీడీవో, అగ్రికల్చర్ ఏవో , ఎంఈఓ, ఆర్ & బి డిపార్ట్మెంట్, ఇతర అధికారులు, స్థానిక గ్రామ సర్పంచ్ కాంచారి సైదమ్మ, గ్రామ ప్రజలు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి...)

దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగు నీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతి రోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు.

కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు.



ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు.

ఖమ్మం ఖిల్లా రోప్ వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్ లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌళిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాపాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రతి డివిజన్ లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 12 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 10 లక్షల మంది వరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన 20 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. ఎస్ .ఐ.ఆర్. కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని, బీఎల్ వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు సకాలంలో స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు కూడా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని, ఫారం సమర్పించని పక్షంలో వారి పేరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉండదని స్పష్టం చేశారు. అనంతరం అభ్యంతరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో అనామలీలను గణనీయంగా తగ్గించగలిగామని, గతంలో 30 శాతం ఉన్న అనామలీలను ప్రస్తుతం 20 శాతానికి తగ్గించామని తెలిపారు. 80 శాతం మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లలో సిస్టమ్ ద్వారా గుర్తించిన అనామలీలకు నోటీసులు జారీ చేసి పరిశీలన చేపడతామని చెప్పారు. తండ్రి–కొడుకు సంబంధంగా మ్యాపింగ్ చేసిన ఇద్దరి మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్నా, తాత–మనవడు సంబంధంగా నమోదు చేసిన వారి మధ్య తక్కువ వ్యత్యాసం ఉన్నా వాటిని అనామలీలుగా పరిగణించి నోటీసులు జారీ అవుతాయని తెలిపారు. అనామలీల సమస్య పరిష్కారానికి పూర్తి ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో గుర్తించిన లోపాలు గల ప్రతి అనామలీ ఓటరుకు నోటీసులు జారీ చేసి, వారి వివరణలు స్వీకరించి సవరణలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. మొత్తం ప్రక్రియను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ఆధారాలతో భద్రపరుస్తామని తెలిపారు. అనామలీలుగా గుర్తించిన ఓటర్ల వద్ద సంబంధిత పత్రాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు జూలై 15 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ ఏలు) ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ ఏలను నియమించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. పాత ఎస్ ఎస్ ఆర్ జాబితాలో ఉండి మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని, రేషన్ కార్డును గుర్తింపు పత్రంగా పరిగణించబోమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ కాని ఓటర్ల ప్రస్తుత స్థితి, గ్రామంలోనే నివసిస్తున్నారా, జీవించి ఉన్నారా లేదా, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా వంటి వివరాలను సేకరిస్తామని తెలిపారు. జనన తేదీలను కూడా పరిశీలిస్తామని చెప్పారు. జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రిలో ఎవరి అయినా ఒకరి జనన లేదా గుర్తింపు పత్రం సమర్పించాలని తెలిపారు. డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్ల నుంచి ఫారాలతో పాటుగుర్తింపు పత్రాలు కూడా సేకరిస్తారని, అనామలీ ఓటర్ల సమస్యలను అవసరమైన పత్రాల ఆధారంగా పరిష్కరిస్తామని చెప్పారు. జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్ ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తమ పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్ లు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 28 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్ లను పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఎస్ ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బీఎల్ వో వివరాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీఓ శ్రీనివాస్, బీఆర్ ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, రమేష్, పి. నాగరాజు, బీజేపీ ప్రతినిధులు రాజేష్, వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాలరావు, సత్యనారాయణ, సిపిఎం డి.తిరుపతి, ఎన్.వీరబాబు, ఆప్ ప్రతినిధి పి.శ్రీనివాస్, టీడీపీ పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, బిఎస్పి సిహెచ్ నాగేశ్వర రావు, ఎం.నాగేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రైలు కట్ట నిర్మాణం డిజైన్ మార్చాలి

- **తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన మోటమర్రి బాధిత రైతులు**



**బోనకల్, జూన్ 10(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని మోటమర్రి వద్ద రైల్వే అధికారులు సర్వే చేసి డిజైన్ చేసిన దానిని మార్చివేయాలని మోటమర్రి గ్రామానికి చెందిన పదిమంది బాధిత రైతులు గురువారం తహసిల్దారును కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా మొదట డిజైన్ చేసిన ప్రకారం అయితే రైతులకు చెందిన 25 ఎకరాల భూమి మాత్రమే పోతుందని, గ్రామానికి చెందిన కొందరు రైల్వే అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి డిజైన్ ను మార్పించడం వల్ల ఎక్కువ మంది రైతులకు చెందిన 60 ఎకరాల భూమి రైల్వే కిందకు వెళ్ళిపోతుందని బాగా పంటలు పండే విలువైన భూమి రైలు కట్ట కింద పోవటంతో తామంతా తీవ్రంగా నష్టపోనున్నామని బాధిత రైతులు తెలిపారు. రెండోసారి చేసిన డిజైన్లు తాము అంగీకరించడం లేదని ఆందోళన చేపట్టగా రైల్వే అధికారులు, జిల్లా రెవిన్యూ అధికారులు, మండల అధికారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారని, వారి సూచన ప్రకారమే జనవరి 9వ తారీకు 2026 సంవత్సరం తాహాసిల్దార్ కు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు తమ ఫిర్యాదును పై అధికారులకు పంపించలేదన్నారు. దీంతో తమంత నష్టపోనున్నామని బాధిత రైతులు వాపోయారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైలు కట్ట నిర్మాణం జరగనివ్వమని తమకు న్యాయం జరిగే వరకూ అన్ని రకాలుగా అడ్డుకుంటామని, న్యాయస్థానానికి సైతం వెళ్తామని ఇప్పటికైనా పత్రికల ద్వారానైనా తమ గోడును జిల్లా అధికారులు రైల్వే అధికారులు పరిగణలోకి రైల్వే అధికారులకు జిల్లా అధికారులకు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. రైతుల గోడు విన్న తహసిల్దార్ ఈ విషయంలో తానేమీ చేయలేనని సమాచారాన్నిరైల్వే అధికారులకు జిల్లా అధికారులకు మీరే ఫిర్యాదు చేసుకోండని సలహా ఇచ్చారు. తొలుత వినతి పత్రాన్ని సైతం తీసుకోవటానికి అంగీకరించని తాసిల్దార్ బాధిత రైతుల ఒత్తిడి మేరకు వినతి పత్రం స్వీకరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో బాధిత రైతులు బోజడ్ల బసవయ్య ,వంగాల నాగేశ్వరరావు, పుల్లారావు ,తాళ్లూరి మధుసూదన్ రావు, బండారు హనుమంతరావు , వల్లవి కొండలరావు,తాళ్లూరి ఆంజనేయులు ఉన్నారు.

## గడపగడపకు ఉపాధ్యాయులు

- **ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ బోధన**




**నేలకొండపల్లి, జూన్ 10 ప్రజా జ్యోతి :** ప్రభుత్వ పాఠశాలలో అత్యు త్తమ బోధన జరుగుతుందని ప్రధాన ఉపాధ్యాయుడు ఆనంద్ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం బడిబాట కార్యక్రమం ను నిర్వహించారు. గడపగడపకు విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మీ పిల్లల చదువు మా బాధ్యత ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అం దిస్తున్నామని అన్నారు. ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడారు... ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారని అన్నారు. మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అనేక కార్యక్రమాలు అందిస్తు న్నట్లు తెలిపారు. ప్రవేట్ మోజులో పడి విద్యార్థుల జీవి తాలను నాశనం చేయవద్దని సూచించారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయుడు వెంగళరావు, దశావతి, పాల్గొన్నారు.

## శాంతి నిలయం లో మాగి ముఖేష్ పుట్టినరోజు వేడుకలు



**బోనకల్, జూన్ 10(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలో గల శాంతి నిలయంలో బుధవారం నాడు అక్కడ నివసిస్తున్న దివ్యాంగుల మధ్య మాగి ఫౌండేషన్ ఫౌండర్ మాగి ముఖేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల మధ్య కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాగి ముఖేష్ కుటుంబ సభ్యులు దివ్యాంగులకు ప్రేమతో భోజనాలు వడ్డించి వారితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. శాంతి నిలయం నిర్వాహకులు మాగి ముఖేష్ కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాగి ఫౌండేషన్ సెక్రటరీ మాగి ప్రశాంతి, మాగి ఫౌండేషన్ సభ్యులు మాగి యశ్వంత్, జగదీష్, తెల్లబోయిన సుమన్, కొమ్మినేని భాస్కర్, వైయస్సార్సీపి బోనకల్ మాజీ మండల అధ్యక్షుడు ఇరుగు జానేష్, రమేష్ సహకరించిన మిత్రులు కూరపాటి సురేష్, సర్దార్,తాళ్లూరి సురేష్, గ్రామ ఉపసర్పంచ్ రాజారావు, కొండ గోపి, మర్రి కరణం తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగున్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వివిధ పోలీస్ స్టేషన్ లలో కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగున్నతి పొందిన 2000 బ్యాచ్ చెందిన ఎనిమిది మంది పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి,అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఖమ్మం జిల్లాకు ఇద్దరు , మహబూబాబాద్ జిల్లా ఒక్కరు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నలుగురు, ఇంటిలిజెన్స్ ఒక్కరు బదిలీపై వెళ్ళనున్నారు.



## గ్రామ అభివృద్దే ప్రధాన లక్ష్యం

- **సర్పంచ్ మోతి వీరస్వామి**



**కారేపల్లి, జూన్ 10, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని రేగుల గూడెం గ్రామ పంచాయతీలో బుధవారం శుభ్రత పరిశుభ్రత పై సర్పంచ్ మోతి వీరస్వామి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యం ముఖ్యమని గ్రామ అభివృద్ధి మా లక్ష్యం అని పేర్కొన్నారు. గ్రామంలో వర్షాకాలం వస్తున్నందున సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ కార్యక్రమాలు పకడిబందీగా అమ్ములు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి మా ప్రధాన లక్ష్మమని స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలు అన్ని సామాన్యులకు అందే విధంగా కృషి చేయాలని తెలిపారు.రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ వస్తాయని ఎవరు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కృషితో గ్రామ అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాలవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సుతారి మేస్త్రి వీరయ్య మృతి

- **అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు**



**కారేపల్లి, జూన్ 10, ప్రజా జ్యోతి :** సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన సుతారి మేస్త్రి, బిల్డర్ చిత్తలూరి వీరయ్య గత నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి బుధవారం మృతి చెందాడు. గత 30 సంవత్సరాలుగా సింగరేణి మండలం తోపాటు ఖమ్మం ఇతర ప్రాంతాల్లో భవనాల నిర్మాణాలు చేపట్టడంతోపాటు ఎంతోమంది కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాడు. మండల కేంద్రమైన కారేపల్లి లో ఎక్కువ మొత్తంగా ఇళ్ల నిర్మాణాలు వీరయ్య మేస్త్రి పర్యవేక్షణలోని జరిగాయి. గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్య చికిత్స పొందుతూ మృతి చెందాడని సమాచారం తెలుసుకున్న మండల ప్రముఖులు, వివిధ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, విలేకరుల మిత్రులు మండల కేంద్రమైన కారేపల్లి లో జరిగిన అంతిమయాత్రలో పాల్గొని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతదేహాన్ని స్వగ్రామమైన విశ్వనాథ పల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

## పైనంపల్లి సొసైటీలో రూ.80 లక్షల రుణాలు పంపిణీ



**నేలకొండపల్లి, జూన్ 10 ప్రజా జ్యోతి:** మండలం లోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు రూ.80 లక్షల రుణాలను పంపిణీ చేశారు.సొసైటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 15 మంది రైతులకు రూ.60 లక్షలు, గృహ నిర్మాణం కోసం మరో రూ.20 లక్షల రుణాలను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు మాట్లాడారు... వాణిజ్య బ్యాంకులకు దీటుగా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ప్రాసెసింగ్ మరియు డాక్యుమెంటేషన్ తో రుణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కావునా రైతులు సహకార రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి డీసీసీబీ మేనేజర్ ఇందు. సూపర్వైజర్ నాగప్రసాద్, సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటరామయ్య, విజయభాస్కర్, రైతు మిత్రలు తాళ్లూరి సత్యం, సామేల్, యాదగిరి, వెంకయ్య, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతులకు నివాళులర్పించిన మనిషా

**కారేపల్లి,జూన్ 10, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల పరిధిలోని విశ్వనాధపల్లి గ్రామానికి చెందిన సుతారి మేస్త్రి, బిల్డర్ చిత్తులూరి వీరయ్య(48), కొమ్ముగూడెం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి మోకాళ్ళ బుచ్చి రాములు(50) లు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో వైరా నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మదన్లాల్ తనయురాలు బానోతు మనిషా లక్ష్మి బుధవారం మృతుల స్వగ్రామాలకు చేరుకుని నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలోఆమె వెంట మాజీ జడ్పిటిసి వాంకుడోత్ జగన్,టిఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్,బీఆర్ఎస్ నాయకులు తాత వెంకన్న, లకావత్ రాము,జడల కళ్యాణ్,డొంకేనా రవీందర్,పల్లపాటి ఉపేందర్,రాజేష్, హరీష్,ఖలీల్ ఉల్లా ఖాన్, రవీందర్ రెడ్డి,తాత ఉపేందర్ తదితరులు ఉన్నారు.



## ఖమ్మం నాయుడుపేట బిషప్ హౌస్

- మత ఐక్యత తో మానవత్వం పెంచు దాము



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట బిషప్ హౌస్ ,పాస్టరల్ సెంటర్ నందు రాష్ట్ర స్థాయి సదస్సుసీసీబీఐ ,టీసీబీసీ ల సౌజన్యముతో ఎక్యూమునిజము పై సదస్సు (సెమినార్)అంతోని దాస్ , ఖమ్మం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్గారు సారధ్యములో జరిగినది. ఈ సదస్సు లో పలువురు చర్చి ఫాదర్లు, సిస్టర్లు ,బ్రదర్ లు ,సంఘ పెద్దలు,మహిళలు, యువకులు పాల్గొన్నారు.సమాజంలో నెలకొన్న పరిస్థితులను అర్థము చేసుకొని అన్ని మతములోని ఉన్నగొప్ప సారాంశము అయిన ఐక్యత మానవత్వమును ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి అని దీనిని అనేక మందికి తెలియపరిచి సమాజంలో శాంతిని నెలకొలపాలని అందుకోసం ఈ యొక్క సదస్సు ద్వారా అనేక సదస్సులు సమావేశాలు భవిష్యత్తులో నిర్వహించి ప్రజలను చైతన్యపరిచి మతం లో ల ఉన్న ఆ యొక్క గొప్ప విషయాలను వెలికి తీసి ప్రబోధించి వాటి సాధనకై నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ఈ యొక్క సదస్సులో పాల్గొన్న వక్తలు తెలియపరిచినారు ఈ కార్యక్రమాలను రాష్ట్ర సెక్రటరీ రెవరెండ్ ఫాదర్ అంతయ్య ఖమ్మం జిల్లా సెక్రెటరీ రెవరెండ్ ఫాదర్ మాన్సిగ్నోర్ . తప్పెట .శౌరి ,కార్యక్రమాలను సమన్వయ పరిచినారు.అనంతరము ఖమ్మం లో అన్ని చర్చిల అధినేతలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశంలో రాబోవు కాలములో ఐక్యతను పెంపొందించుకొని శాంతియుత సహజీవనానికి తగు మార్గములు ఏర్పరచుకొని ముందుకు వెళ్లాలని భవిష్యత్తులో కమిటీలు ఏర్పరచుకుని క్రైస్తవ హక్కుల కోసం ముఖ్యముగా దళిత క్రైస్తవలకు ఎస్సీ హోదా లభించే దానికి, క్రైస్తవులకు రావలసిన అప్పులు సాధించే దానికి జరుగుతున్న పరిణామాలను పరిష్కరించుకోవడానికి సమైక్యంగా ఉండాలని ఈ యొక్క సదస్సులో తీర్మానించడం జరిగినది. ఈ సదస్సు మెయిన్ చర్చలు మరియు సి ఎస్ ఐ ఇతర డినామినేషన్ల సంఘ కాపరులు పాల్గొని ఐక్యతను కార్యాచరణలను సమన్వయం పరుస్తామని తెలియపరిచినారు.

## అధికారుల పై దౌర్జన్యానికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి

- కొండబోయిన నాగేశ్వరరావు, కే. నరేంద్ర



**కారేపల్లి, జూన్ 10, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలంలో అక్రమ మట్టి తోల కం దందా చేయడమే కాకుండా అడ్డు చెప్పిన అధికారులపై దౌర్జన్యానికి పాల్పడటంను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర తీవ్రంగా ఖండించారు. బుధవారం వారు మాట్లాడుతూ గోడం నిర్మాణం పేరుతోపకృతి వ నర్లను దెబ్బతీసే పద్ధతిలో ఒకవైపు గుట్టకిందగుంపు గంగాదేవి గుట్ట మట్టిని మరోవైపు, కొత్తతండా పంచాయతీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తోలకం దందాల కి పాల్పడుతున్న వారు అడ్డు చెప్పిన అధికారుల పై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారి ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోయిందని మంగళవారం మండల పరిధిలో కొత్త తండా గ్రామం అక్రమ మట్టి తోలకం పై విచారణకు వెళ్ళిన సింగరేణి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ),జిపిఓ ఇతర అధికారులపై దౌర్జన్యానికి పాల్పడి, కారు తాళాలు లాక్కొని అధికారులను నిర్బంధించిన తీరు అక్రమ దారుల ఆగడాల పెట్రేగి పోతున్నాయి అనడానికి నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. సంబంధిత విషయంపై సమాచారం తెలిసిన పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి దౌర్జన్యానికి పాల్పడిన వారి నుండి కారు తాళం ఇప్పించి వెనుతిరిగి వచ్చారు తప్ప దౌర్జన్యాన్ని పాల్పడిన వ్యక్తులను, అక్రమ మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గాని స్టేషన్ తీసుకురాలేదు,తక్షణం మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి రవాణా దంధా ను నిలుపుదల చేయుటకు జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వారు అన్నారు. లేనియెడల అక్రమ మట్టి దందా నిలుపుదలపై పర్యావరణం పకృతిని కాపాడుకొనుటకు మండల వ్యాప్తంగా ప్రజలని సమీకరించి ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాష్, వడ్డే అజయ్ బాబు, బానోత్ బన్సీలాల్, కేసగాని ఉపేందర్, అజ్మీర శోభన్, సీతారాములు, రామ్మూర్తి, సైదులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనైనది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు జిల్లా లోని ఐదు నియోజకవర్గాలలో శిక్షణ తరగతులు నిర్వహించుట గురించి,బూత్,గ్రామ,మండల, పట్టణ కమిటీలను ఈనెల 30 వ తేదీ లోగా పూర్తి చేయాలని మండల,పట్టణ అధ్యక్షులకు దిశానిర్దేశం చేసినారు. జిల్లా లోని వివిధ మండలాలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులను ఇంచార్జిలుగా నియమించటం జరిగినదని,సంబంధిత ఇంచార్జి లు వారికి కేటాయించిన మండలాలలో పర్యటించి సంబంధిత నియోజకవర్గ శాసనసభ సభ్యుల ఆమోదంతో కమిటీలు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేసినారు.అదేవిధంగా ఈనెల 15 న రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు జందినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానం చేసినారు కావున శ్రేణులు అందరు ఆయా సేవా కార్యక్రమాలలో విరివిగా పాల్గొనాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూరంశెట్టి నాగభూషణం,పులిపాటి వెంకయ్య, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు దొబ్బల సౌజన్య, వేజెండ్ల సాయి కుమార్, మొక్క శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య,డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళికృష్ణ, పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, మధిర అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, వైరా ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, బ్లాక్,మండల,పట్టణ అధ్యక్షులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత



**మధిర ప్రజా జ్యోతి** ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహకారంతో మధిర మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు.మధిర మున్సిపాలిటీలోని ఇల్లందులపాడు స్మశాన వాటిక వెళ్లడానికి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి నగర అభివృద్ధి పథకం కింద తెలంగాణ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగా, బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు,నాణ్యమైన రోడ్లు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడం ద్వారా ఇల్లందులపాడు గ్రామం వాసుల చిరకాల సమస్య తీరుతుందని,రాకపోకలకు ఎంతో సౌకర్యవంతంగా మారుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోన ధని కుమార్,మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనెటిక్ ఇజ్రాయిల్ పాల్, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం,వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి,మిరియాల వెంకటరమణ గుప్తా,రంగ శీను,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు,సుధాకర్, ఇల్లందులపాడు గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకుడు మేడిది నారాయణరెడ్డి మృతి

- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, శ్రేణులు



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డుకు చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు మండల సమితి సభ్యుడు మేడిది నారాయణరెడ్డి(77) అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ భౌతిక కాయాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పార్టీ తరపునుంచి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు . మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బానోతు రామకోటి, ఎడ్లపల్లి శంకరయ్య, సిపిఐ పాలేరు నియోజకవర్గ నాయకుడు లింగ వెంకట నారాయణ, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ సీనియర్ నాయకుడు మామిండ్ల సుదర్శన్ రెడ్డి, 32వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో ఘోర రోడ్డు ప్రమాదం

- బస్సు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు,
- భర్త పరిస్థితి విషమం

**కల్లూరు, జూన్ 10 :** ప్రజా జ్యోతి కల్లూరు మండలంలోని మధిర బ్రాంచ్ ఎన్ఎస్పీ కాలువ బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై వెళ్తున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు బస్సు బైక్ ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఏడుకొండలు, కోటమ్మ అనే భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ లో కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏడుకొండలు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోటమ్మ ప్రస్తుతం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, మూడో కౌన్సిలర్ సుధారాణి, పలువురు స్థానిక నాయకులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. వారు వెంటనే స్థానిక ఎమ్మెల్యే రాగమయికి ఫోన్ ద్వారా సమాచారం అందించి బాధితుల పరిస్థితిని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి జిల్లా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదానికి కారణమైన ప్రైవేటు బస్సును పోలీసులు స్వాధీనం చేసుకుని కల్లూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా బ్రిడ్జిపై జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





# ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి తుమ్మల







**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో విసృతంగా పర్యటించారు,ఈ పర్యటనలో భాగంగామమతా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్ ను ప్రారంభించి,సందర్శించడం జరిగింది,తదనంతరం ఖమ్మం నగరంలో ఇల్లందు క్రాస్ రోడ్డులో స్కిన్ఎక్స్ ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభించి,ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు,ఆ తరువాత న్యూ బస్టాండ్ దగ్గరలో గల నూతనంగా ఏర్పాటు చేసిన బచ్ పన్ స్కూల్ ని ప్రారంభించి, విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హనుమంత రావు,సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ ఖాదర్ బాబా, ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,ఆయా డివిజన్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు,అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాదాతకు విశిష్ట సన్మానం

- డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు ఘన సన్మానం



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** విద్యా, సామాజిక, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ వేలాది మందికి స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖ విద్యావేత్త, పులిపాటి విద్యాసంస్థల అధినేత, ఖమ్మం పౌర సమితి అధ్యక్షులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ కి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రెండోసారి నియమితులైన సందర్భంగా పులిపాటి నగర్-2లోని పులిపాటి మినీ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.2008లో భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా వాగ్దేవి విద్యా పురస్కారం అందుకున్న డాక్టర్ పులిపాటి ప్రసాద్,పులిపాటి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు విద్య, ఆర్థిక సహాయం, అన్నదాన సేవలు అందిస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. సమాజంలో ఆపద్బాంధవుడిగా, విద్యాదాతగా ఆయన సాధించిన గుర్తింపు అభినందనీయమన్నారు.రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు అమర్నాథ్ లక్ష్మీనారాయణ నాయకత్వంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరిగి బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ప్రముఖులు,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ గారిని శాలువాలు,జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో సిద్ధంశెట్టి శ్రీకాంత్,కోదుమూరు భద్రయ్య,కోదుమూరు జగన్నాథం, మాశెట్టి వరప్రసాద్, కొంకిమళ్ల మృత్యుంజయ గుప్తా, పాలవాయి వెంకటేశ్వర్లు,దాస శ్రీనివాసరావు,వజినేపల్లి చంద్రశేఖర్ గుప్తా, తేలుకుంట్ల ఓంకార్, వెల్లంపల్లి వెంకట సుబ్బారావు, విద్యాల విశ్వనాథ్ గుప్తా, కాజా వెంకటేశ్వర రావు, సుగ్గల శ్రీహరి, గోపాలరావు,తాడికొండ అరవింద్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ డాక్టర్ పులిపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

# మదన్ లాల్ వారసురాలిగా తనయ రాజకీయ అరంగ్రేట్రమ్



**వైరా జూన్ 9 ప్రజా జ్యోతి** రాజకీయాలలో కీ,,శే,, బానోత్ మదన్ లాల్ రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమైనది. ఆయన విద్యార్థి దశ నుండే విద్యార్థి ఉద్యమాలలో నలిగిన నాయకుడు కమ్యూనిస్టు భావాజాలంతో ప్రజా ఉద్యమాలు నిర్వహించారు. సర్పంచ్ స్థాయి నుండి ఎమ్మెల్యే వరకు ఎదిగారు. 2009లో వైరా నియోజకవర్గం ఎస్టీ రిజర్వుడు కావడంతో ఆయన రాజకీయ ప్రమోషన్ వైరా ప్రాంతంలో మొదలైంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మదన్ లాల్, ప్రజల సమస్యల పట్ల నిర్విరామంగా కృషి చేశారు. ఎమ్మెల్యేగా కొనసాగిన కాలంలో వైరా భివృద్ధి కోసం పాటుపడ్డారు. గెలిచిన, ఓడిన ప్రజల మధ్య పని చేసే నాయకుడిగా పేరు సంపాదించారు. మదన్ లాల్ మరణం తర్వాత ఆయన రాజకీయ వారసురాలిగా భానోత్ మనిషా లక్ష్మి రాజకీయ అరంగ్రేట్రం చేశారు. టిఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం సూచన మేరకు, ఆమె వైరా నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ, అన్ని మండలాలను చుట్టేస్తున్నారు. వైరా, కారేపల్లి, కొనిజర్ల ఏనుకూర్, జూలూరుపాడు మండలాల్లో ప్రజలను నేరుగా కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజలకు ఎక్కడ ఆపదంటే, అక్కడికి వెళ్లి నేనున్నానంటూ, భరోసా ఇస్తున్నారు. స్థానిక సమస్యలపైన మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ప్రతిరోజు రెండు గ్రామాలను ఎంచుకొని, ఊరు సమస్యలు, వ్యక్తిగత ప్రజల అవసరాలు తెలుసుకుంటున్నారు. మదన్ లాల్ మరణం తర్వాత, టిఆర్ఎస్ పార్టీ మొదట ఆయన సతీమణి, మంజులకి పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడానికి సుముకుత వ్యక్తం చేసింది. వైరా నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జిగా కూడా నియమించడం జరిగింది. ఆమెకి రాజకీయ పరిణితి లేకపోవడం ప్రాథమిక చదువు మాత్రమే ఉండటం వల్ల భానోత్ మంజుల ప్రజల్లో చొరవగా దూసుకుపోలేకపోయారు. మదన్ లాల్ తనయ మనీషా లక్ష్మి పేరు తెరపైకి రావడంతో వైరా టిఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం అలుముకుంది. ఆమె ప్రజల్లో తిరుగుతున్న తీరుని, చొరవని చూసి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉత్సాహం పెరిగింది. సామాన్య ప్రజలతో సైతం కలుపుగోలుగా మాట్లాడుతూ, మహిళలను ఆలింగనం చేసుకుంటూ, ఇంటి ఆడబిడ్డలాగా సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. తండ్రికి తగ్గ తనయగా మమేకమవుతున్నారని ప్రజల్లో చర్చ జరుగుతుంది. మనిషా లక్ష్మి బిటెక్ పూర్తి చేసి ఐటి రంగంలో కొంతకాలం పని చేశారు. ఆమె భర్త సెంట్రల్ మైనింగ్ లిమిటెడ్ కంపెనీలో మేనేజర్ గా పనిచేస్తున్నారు. మనీషా తన ఐటీ రంగం మీద వచ్చే లక్షలాది ఆదాయన్ని కాదనుకొని తండ్రి ఆశయ సాధన కోసం ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చానని ఆమె ప్రజా జ్యోతి కి తెలియజేశారు. నాన్న వారసురాలిగా నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై ఉంటానని అన్నారు. వైరా నియోజకవర్గ ప్రజలకు మా కుటుంబంపైన అపారమైన అభిమానం ఉన్నదని ఆమె అన్నారు. రాబోవు ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రజల అభిమానాన్ని, ప్రేమను పొందుతానని తెలియజేశారు. తన తండ్రిలాగానే వైరా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.

# సిపిఐ సభ్యురాలు యంగల సత్యవేద మృతి





**బోనకల్, జూన్ 10 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని కలకోట గ్రామానికి చెందిన మత్యశాఖ సోసైటీ మాజీ అధ్యక్షులు, సిపిఐ సీనియర్ నాయకులు యంగల యేలేషు సతీమణి, సిపిఐ సభ్యురాలు యంగల సత్యవేద(73) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మృతదేహాన్ని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, యంగల వెంకటమ్మ, శాఖ కార్యదర్శి యంగల పెద్ద రమేష్లు పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి నలుగురు కుమారులు ఉన్నారు. నివాళులర్పించి వారిలో సిపిఐ నాయకులు యంగల కేరి, వార్డు సభ్యులు యంగల కృష్ణవేణి, కాంగ్రెస్ నాయకులు తోటపల్లి దావీదు, బిఆర్ఎస్ నాయకులు ఇటికాల శ్రీనివాసరావు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్కే అబ్బాసీమియా, మాజీ ఎంపిటీసీ మాతంగి సామ్రాజ్యం తదితరులున్నారు.

# ఆదరణ సేవ ఫౌండేషన్ లో మొండితోక సుధాకర్ పుట్టినరోజు సందర్భంగా భోజన వితరణ

**మధిర ప్రజా జ్యోతి** పట్టణం పరిధిలోని సుశీల డిగ్రీ కాలేజ్ రోడ్ లో ఆదరణ సేవా ఫౌండేషన్ లో మధిర వాస్తవ్యులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొం డితోక సుధాకర్ పుట్టినరోజు సందర్భంగా ఈరోజు వృద్ధులకి మతిస్థిమితం లేని వారికి మరియు వినాయకుడి గుడి వద్ద పండ్లు స్వీట్లు మరియు భోజనం వితరణగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి భోజన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సుధాకర్ కి ప్రత్యేక ధన్యవాదాలు పుట్టినరోజు శుభాకాంక్షలు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని భగవంతుని కోరుకున్నారు. ఈ కా ర్యక్రమంలో గట్టిగుండె క్రాంతి,చిలక రాజేంద్ర,గద్దల శివకృష్ణ,నందిపాటి చిన్నబాబు,గద్దల పవన్, మారాపోగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం డీసీసీ చీఫ్ నూతి గౌడ్ తో మండలం అధ్యక్షులు భేటీ



**కల్లూరు, జూన్ 10 : ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లాలోని ఐదు నియోజకవర్గాల మండల స్థాయి నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు మండల అధ్యక్షులు డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పెనుబల్లి మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వర్లు, వేంసూర్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, కల్లూరు మండల అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, అలాగే కల్లూరు టౌన్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ఈ భేటీలో పాల్గొని పార్టీ పటిష్టత పై చర్చించారు. మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న కార్యాచరణపై ఈ సమావేశంలో కీలకంగా చర్చ జరిగినట్లు సమాచారం. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా క్షేత్రస్థాయి నాయకులను సమన్వయం చేసుకోవడమే ఈ మీటింగ్ ముఖ్య ఉద్దేశమని డీసీసీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తమ తమ ప్రాంతాల్లోని పరిస్థితులను, కార్యకర్తల అభిప్రాయాలను డీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు.